teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 133 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 5 నవంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## నేడు తెలంగాణలో సెలవు

### కార్తీక పౌర్ణమి సందర్భంగా సెలవు ప్రకటించిన ప్రభుత్వం




తెలంగాణ బ్యూరో, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో బుధవారం నవంబర్ 5, 2025న పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు మూసి ఉండనున్నాయి. నవంబర్ 5న గురునానక్ జయంతి, ప్రభుత్వ సెలవుదినం. దీని కోసం ప్రభుత్వం గెజిటెడ్ సెలవు ప్రకటించింది. అయితే కార్తీక పౌర్ణమి హిందువులు

మిగతా 2 లో



## సిగాచీ ప్రమాదంపై
# హైకోర్టు సీరియస్

- పరిహారంపై కౌంటర్ దాఖలుకు ఆదేశం
- 54 మంది మృతి ఘటనలో 4 నెలలైనా అరెస్టులు లేవు: పిటిషనర్ లాయర్
- రూ. కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారు: హైకోర్టు
- విచారణ 2 వారాలకు వాయిదా
- సమగ్ర కౌంటర్ దాఖలుకు ఆదేశం

### కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు



తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపిన ప్రమాదం సిగాచీ పరిశ్రమలో ప్రమాద ఘటనలో ఆ కంపెనీ ఎండీకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతుల, బాధితుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

## రంగారెడ్డి రోడ్డు ప్రమాదంపై
# హెచ్ఆర్సీ సుమోటో కేసు

- డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక కోరిన కమిషన్
- భద్రత లోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై కమిషన్ ఆందోళన
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచన






హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం (19 మంది మృతి, పలువురు గాయాలు) పై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. ఈ కేసు నంబర్ హెచ్ఆర్సీ No.7141/2025 గా నమోదు చేసింది. డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్ ఏర్పడింది. రోడ్డు

మిగతా 2 లో



## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై
# కీలక పరిణామం

- బీఆర్ఎస్ పిటిషన్లపై విచారణ చేపట్టనున్న సభాపతి
- సంబంధించిన షెడ్యూల్ విడుదల
- ఈనెల 6, 7, 12, 13 తేదీల్లో విచారణ
- మొదట పిటిషనర్లు.. తర్వాత ప్రతివాదుల క్రాస్ ఎగ్జామినేషన్

హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు శాసనసభ స్పీకర్ కార్యాలయం దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును గడువు కోరిన విషయం తెలిసిందే. గతంలో కోర్టు విధించిన మూడు నెలల గడువు అక్టోబర్ 31తో పూర్తికావడంతో రెండు నెలల గడువు ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ కార్యాలయం కోరింది. ఇప్పటి వరకు కేవలం నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయింది. ఈ నేపథ్యంలోనే

మిగతా 2 లో



## తెలంగాణ- జర్మనీ భాగస్వామ్యంపై సీఎం ఫోకస్

పెట్టుబడులకై జర్మనీ కంపెనీలను ఆహ్వానించిన సీఎం

హైదరాబాద్‌లో డాయిచ్ బోర్సే గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ప్రారంభం

వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

.. వివరాలు 2లో



## బకాయిలు చెల్లించకపోతే లిక్కర్ ఉత్పత్తి ఆపేస్తాం

డిసెంబర్‌లో మద్యం కొరత, ఆర్థిక విపత్తు తప్పదు

ప్రభుత్వానికి మరోసారి లిక్కర్ కంపెనీల అల్టిమేటం

.. వివరాలు 2లో




## ఔట్ సోర్సింగ్ పంచాయతీ

కార్యదర్శులకు శుభవార్త

1037 మందిని మరో ఏడాది కొనసాగించేందుకు జీవో జారీ


.. వివరాలు 2లో

## తెలంగాణలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- భారత సైన్యంలో చేరేందుకు అవకాశం
- ఈ నెల 10 నుంచి 22 వరకు హన్మకొండలో ర్యాలీ
- 33 జిల్లాల అభ్యర్థులు పాల్గొనే అవకాశం

02









## భారతీయ వినియోగదారులకు
# ఓపెన్ఏఐ బంపర్ ఆఫర్

- చాట్‌జీపీటీ గో సబ్‌స్క్రిప్షన్ ఏడాది పాటు ఉచితం
- అధిక మెసేజ్, ఇమేజ్ జనరేషన్, పరిమితి సౌకర్యాలు

న్యూ ఢిల్లీ, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ప్రపంచ ప్రథమ స్థానంలో ఉన్న ఓపెన్ఏఐ భారతీయ వినియోగదారుల కోసం సంచలన ఆఫర్‌ను ప్రకటించిన విషయం

మిగతా 2 లో

## మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌కు శాఖ కేటాయింపు

- మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ
- గవర్నర్ ఆమోదంతో శాఖలు కేటాయించినట్టు సీఎస్ వెల్లడి



## రీయింబర్స్‌మెంట్ పాలసీపై అధ్యయనానికి కమిటీ

- ఈ మేరకు సర్కారు ఉత్తర్వులు జారీ
- ఛైర్మన్‌గా సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్
- 3 నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం జీవోలో వెల్లడి

తెలంగాణ బ్యూరో, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై అధ్యయనానికి కమిటీ వేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కోదండరాం, కంచ ఐలయ్యతోపాటు ఆర్థిక, విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ,


మిగతా 2 లో



## బీఆర్ఎస్ రోడ్ షోలకు పోలీసుల గ్రీన్ సిగ్నల్

నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగే అవకాశం

పూర్తి సెక్యూరిటీ ఆధీనంలో డ్రోన్లు వినియోగిస్తాం : సీపీ




.. వివరాలు 2లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కీలక పరిణామం




- బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి జనసేన పార్టీ మద్దతు
- మద్దతుగా ప్రచారంలో పాల్గొంటామని జనసేన టీ అధ్యక్షుడు హామీ

05

# సిగాచీ ప్రమాదంపై హైకోర్టు సీరియస్

హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపిన ప్రమాదం సిగాచీ పరిశ్రమలో ప్రమాద ఘటనలో ఆ కంపెనీ ఎండీకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతుల, బాధితుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గత జులై 1న పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి మూడంతస్తుల భవనం పేకమేడలా కూలిపోయింది. ఈ ఘటనలో 54 మంది కార్మికులు చనిపోయారు. ఈ ప్రమాద ఘటనపై కలపాల బాబురావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై మంగళవారం హైకోర్టు విచారించింది. పిటిషనర్ తరఫున వసుధానాగరాజు వాదనలు వినిపించారు. ఈ ఘటనలో 54 మంది మృతి చెందారని ప్రమాదం జరిగి 4 నెలలు గడిచిన ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పిటిషనర్ తరఫున లాయర్ వాదించారు. బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు ఆ పరిహారం అందించలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఈ పరిశ్రమలో ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు.



ఏఏజీ వాదనలు వినిపిస్తూ ఈ ప్రమాదంలో సిగాచీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం చనిపోయారని కోర్టుకు తెలిపారు. దీంతో కంపెనీ యాజమాన్యంలో ఇతరులు కూడా ఉన్నారు కదా అని ఏఏజీని హైకోర్టు ప్రశ్నించింది. అలాగే రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు చెల్లించామని కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ తెలిపారు. 192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారని తెలిపారు. పోలీసులు సైతం నిపుణులు కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నారని కోర్టుకు వివరించగా 2 వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశిస్తూ తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా వేసింది.

# ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు శుభవార్త




హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. 1037 మంది ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల సేవలను మరో ఏడాది పాటు కొనసాగించేందుకు అనుమతి ఇస్తూ జీవో జారీ చేసింది. కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ నియామకానికి సంబంధించిన పద్ధతులను అనుసరించాలని నెలకు రూ. 19,500 వేతనం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పంచాయతీ సెక్రటరీల సంఖ్య గ్రామ పంచాయతీల సంఖ్యను మించకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ టు గవర్నమెంట్ సందీప్ కుమార్ సుల్తానియా పేర్కొన్నారు.

# రీయింబర్స్‌మెంట్ పాలసీపై అధ్యయనానికి కమిటీ

మొదటి పేజీ తరువాయి

మైనారిటీ సంక్షేమశాఖల కార్యదర్శులు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌తో పాటు ఉన్నత విద్యాసంస్థల నుంచి ముగ్గురు ప్రతినిధులను కమిటీలో సభ్యులుగా నియమించారు. 3 నెలల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. అలాగే విద్యా సంస్థలు పేర్కొన్న సూచనలపై కూడా కమిటీ అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను కమిటీ పరిశీలించి, పాలసీపై ఈ కమిటీ ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అయితే గత నెల 28న తేదీనే ఈ జీవో ఇవ్వగా తాజాగా ఆ జీవోను విడుదల చేసింది.

# నేడు తెలంగాణలో సెలవు

మొదటి పేజీ తరువాయి

ఎంతో పవిత్రంగా భావించే రోజు. ఈ పర్వదినాన ప్రజలు వేడుకలు జరుపుకుంటారు. ఈ పండగ సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ విద్యాసంస్థలు, ఆఫీసులకు సెలవుపై కన్ఫ్యూజన్ కొనసాగుతోంది. సెలవు ఉంటుందని కొందరు, లేదని మరికొందరు ప్రచారం చేస్తున్నారు. అయితే కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 5న తెలంగాణలో అయితే అధికారిక సెలవు ఉంది. ఈ మేరకు ప్రభుత్వ హాలిడే క్యాలెండర్ లో సెలవు దినంగా పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమితో పాటు సిక్కుల మతగురువు గురునానక్ జయంతి కూడా నవంబర్ 5నే. ఇలా హిందువులు, సిక్కులకు ఎంతో పవిత్రమైన రోజు కాబట్టి రేపు (బుధవారం) పూర్తిస్థాయిలో సెలవు ప్రకటించింది ప్రభుత్వం.

# తెలంగాణలో 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ



తెలంగాణ బ్యూరో, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ యువతకు ఇండియన్ ఆర్మీ గుడ్‌న్యూస్ చెప్పింది. భారత సైన్యంలో చేరేందుకు తెలంగాణలో 'అగ్నివీర్'రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ అగ్నివీర్ల నియామక ర్యాలీ ఈ నెల 10 నుంచి 22 వరకు హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనుందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. చెన్నై జోన్ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ సమన్వయం, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ ర్యాలీ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల అభ్యర్థులు ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. దీనికి పదో తరగతి అర్హత ఉండాలని సూచించారు. అభ్యర్థులు తమకు జారీ చేసిన అడ్మిట్ కార్డుతో పాటు అవసరమైన అన్ని డాక్యుమెంట్లను తీసుకురావాలని బోర్డు సూచించింది. సంబంధిత నోటిఫికేషన్ ఇప్పటికే మార్చి 12 విడుదలై www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు బోర్డు తెలిపింది. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని బోర్డు అధికారులు తెలిపారు. నియామక సంబంధిత వివరాల కోసం అభ్యర్థులు సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని టెలిఫోన్ నంబర్లు 040-27740059, 27740205లకు సంప్రదించవచ్చని సూచించారు.

# భారతీయ వినియోగదారులకు ఓపెన్‌ఏఐ బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి




తెలిసిందే. చాట్ జీపీటీ సేవలను మరింత విస్తృతంగా అందించాలనే ఉద్దేశంతో సంస్థ తాజాగా "చాట్ జీపీటీ గో" సబ్‌స్క్రిప్షన్‌ను భారత్‌లోని వినియోగదారులకు 12 నెలలపాటు పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. ఈ ఉచిత ఆఫర్ 2025 నవంబర్ 4 నుండి ప్రారంభమై, ఒక సంవత్సరం పాటు కొనసాగనుంది. దీని ద్వారా వినియోగదారులు అధిక మెసేజ్ పరిమితి, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్‌లు, వ్యక్తిగత మెమరీ ఫీచర్ వంటి ప్రీమియం సౌకర్యాలను పొందవచ్చు. ఈ ఆఫర్ కొత్త వినియోగదారులతో పాటు ఇప్పటికే చాట్ జీపీటీ గో ఉపయోగిస్తున్నవారికీ వర్తిస్తుంది. ఓపెన్‌ఏఐ ప్రకటన ప్రకారం ఈ ఆఫర్ కేవలం భారతదేశంలో ఉన్న యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఉచిత సబ్‌స్క్రిప్షన్ తర్వాత ఎటువంటి అదనపు ఛార్జీలు విధించబడవని సంస్థ స్పష్టం చేసింది. అయితే, ఉచిత కాలం పూర్తయ్యాక సాధారణ సబ్‌స్క్రిప్షన్ రుసుములు తిరిగి అమలులోకి వస్తాయి. సాంకేతిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం భారత మార్కెట్లో చాట్ జీపీటీ వినియోగాన్ని మరింత పెంచుతుందని అంచనా. కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలను సాధారణ ప్రజలకు చేరువ చేసే దిశగా ఓపెన్‌ఏఐ తీసుకున్న ఈ చర్యకు వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోంది.

**ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ పొందే విధానం**

- చాట్ జీపీటీ వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్‌లో లాగిన్ వేయండి.
- ప్రొఫైల్ ఐకాన్‌ను ఎంపిక చేసి "అప్గ్రేడ్ ప్లాన్" – సెట్టింగ్స్ → సబ్స్క్రయిప్షన్ ఎంచుకోండి.
- కనిపించే "చాట్ జీపీటీ గో" ప్లాన్‌ను ఎంచుకొని ఆప్షన్‌ను యాక్టివేట్ చేయండి.
- అవసరమైతే, చెల్లింపు సమాచారం (కార్డ్/యూపీఐ) ఇవ్వండి – మొదటి ఏడాది ఛార్జ్ ఉండదు.
- యాక్టివేషన్ పూర్తైన తరువాత మీరు చాట్ జీపీటీ గో ఫీచర్లు (విస్తారమైన చాట్ లిమిట్స్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్‌లు) వినియోగించవచ్చు.

# మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌కు శాఖ కేటాయింపు



హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర కేబినెట్ లో కొత్తగా చేరిన మంత్రి మహ్మద్ అజారుద్దీన్ కు ప్రభుత్వం శాఖలను కేటాయించింది. మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలను కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్ ఆమోదంతో శాఖలు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం సీఎం వద్ద మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు పట్టణాభివృద్ధి శాఖ, జనరల్ అడ్మినిస్ట్రేషన్, లా అండ్ ఆర్డర్ తో పాటు ఏ మంత్రికి కేటాయించని ఇతర విభాగాలు ఉన్నాయి. వాటిలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను అజారుద్దీన్ కు కేటాయించారు. ఇక గత జూన్ లో మంత్రివర్గలో చేరిన అడ్లూరి లక్ష్మణ్ కు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖలను ప్రభుత్వం అప్పగించింది. తాజాగా ఆయన వద్దనున్న మైనార్టీ శాఖను అజారుద్దీన్‌కు అప్పగించింది. కాగా గత శుక్రవారం అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అయితే హోం శాఖ కోసం అజారుద్దీన్ ప్రయత్నించారనే ప్రచారం జరిగింది. దీంతో ఆయనకు కేటాయించబోయే పోర్ట్ ఫోలియోపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఆయనకు హోం శాఖకు బదులు మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలను ప్రభుత్వం కేటాయించింది.

# రంగారెడ్డి రోడ్డు ప్రమాదంపై హెచ్‌ఆర్సీ సుమోటో కేసు



మొదటి పేజీ తరువాయి

భద్రతా లోపాలు, అధిక వేగం, హైవే విస్తరణ ఆలస్యం, అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రవాణా శాఖ, హోం శాఖ, గనులు & భూగర్భశాస్త్ర శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, అలాగే టీజీఎస్ ఆర్టీసీ అధికారుల నుండి ప్రమాదంపై సమగ్ర నివేదికలను డిసెంబర్ 15, 2025 ఉదయం 11 గంటలలోపు సమర్పించాలని కమిషన్ ఆదేశించింది. ఈ ఘటనపై మరింత విచారణ జరిపి బాధ్యత వహించాల్సిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఒక ప్రకటన విడుదల చేసింది.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి

ఇదే అంశంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సభాపతి విచారణ చేపట్టనున్నారు. ఈ మేరకు అందుకు సంబంధించి మంగళవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లాం వెంకట్రావు, అరికెపూడి గాంధీ అనర్హత పిటిషన్లపై ఈనెల 6, 7, 12, 13 తేదీల్లో విచారణ చేపడతామని, మొదట పిటిషనర్లు. ఆ తర్వాత ప్రతివాదుల క్రాస్ ఎగ్జామినేషన్ ఉంటుందన్నారు. రోజుకు ఇద్దరు చొప్పున క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ఉంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ తాజాగా షెడ్యూల్ విడుదల చేశారు.

# తెలంగాణ- జర్మనీ భాగస్వామ్యంపై సీఎం ఫోకస్

హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): పెట్టుబడుల విషయంలో తెలంగాణ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని, ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో జర్మనీ కంపెనీలు తమ వద్ద పెట్టుబడులు పెట్టాలని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన నివాసంలో జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ బృందంతో భేటీ అయ్యారు. డాయిచ్ బోర్సే కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో మంగళవారం తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను ప్రారంభిస్తున్నట్లు సీఎంకు జర్మనీ బృందం తెలిపింది. జీసీసీ ఏర్పాటుకు గాను తమ సిటీని ఎంచుకున్నందుకు సీఎం వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ప్రపంచ దేశాల నుంచి మరిన్ని పెట్టుబడులు రావాలని అందుకు వారికి ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతును ఇస్తూ సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో నెలకొల్పబోయే డాయిచ్ బోర్సే కంపెనీ జీసీసీ ఏర్పాటుతో వచ్చే రెండేళ్లలో ఐటీ రంగంలో దాదాపు వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వబోతోందని అన్నారు. ఇక హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని జర్మనీ బృందాన్ని సీఎం కోరారు. నగరంలో జర్మన్ టీచర్లను నియమించి తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాషను నేర్పించేందుకు సహకరించాలని జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్‌కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా TOMCOM ద్వారా వొకేషనల్ ఎడ్యుకేషన్, స్కిల్ వర్క్ విషయంలో శిక్షణ అందించేందుకు సహకరించాలని విన్నవించారు. ఈ భేటీలో అమితా దేశాయ్, డాయిచ్ బోర్సే సియో, COO డాక్టర్ క్రిస్టోఫ్ బోమ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించకపోతే లిక్కర్ ఉత్పత్తి ఆపేస్తాం

తెలంగాణ బ్యూరో, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వానికి లిక్కర్ కంపెనీలు మరోసారి అల్టిమేటం జారీ చేసాయి. పెండింగ్ బకాయిలను చెల్లించకపోతే లిక్కర్ ఉత్పత్తి ఆపేస్తామని హెచ్చరించాయి. తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే డిసెంబర్‌లో మద్యం కొరత, ఆర్థిక విపత్తు తప్పదని లిక్కర్, బేవరేజెస్ కంపెనీల సంఘం ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చింది. సర్కారు నుంచి ₹3,366 కోట్ల బకాయిలు రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో మద్యం తయారీ కంపెనీలు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొంది. బిల్లులు చెల్లించకుంటే మద్యం ఉత్పత్తిని నిలిపివేయడం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేసింది. ఇదే జరిగితే కొత్త సంవత్సరానికి మందుబాబులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# బీఆర్ఎస్ రోడ్ షోలకు పోలీసుల గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో జరగనున్న బీఆర్ఎస్ రోడ్ షోలకు పోలీసుల అనుమతి లభించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ మరో కీలక నేత హరీష్ రావుల రోడ్ షోలకు నగర సీపీ సజ్జనార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈమేరకు హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బీఆర్ఎస్ నేతలు దూదిమెట్ల బాలరాజు యాదవ్, నాగేందర్ గౌడ్, కిషోర్ గౌడ్‌లు నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందించగా, అందుకు సానుకూల స్పందన వచ్చింది. అలాగే రోడ్ షోలకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, జనం ప్రచారానికి తరలివస్తున్న నేపథ్యంలో వీడియో చిత్రీకరణ కోసం, నాయకులు- కార్యకర్తలపై దాడులు జరిగే అవకాశం ఉన్నందున పూర్తి సెక్యూరిటీ ఆధీనంలో డ్రోన్లు వినియోగిస్తామని తెలిపారు.

# అలసత్వం వహించేవారికి వేతనాల్లో కోత విధించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించేవారికి వేతనాల్లో కోత విధించాలని జిల్లా ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా పరిశీలించిన కలెక్టర్, సాధారణ వార్డులు, ఐసీయూ వార్డులు, రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, ఓపి సేవలు, సహాయక కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం అన్ని విభాగాల ప్రధాన వైద్యులతో సమావేశం నిర్వహించారు. సిబ్బంది ఖచ్చితమైన సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోజు రోగులకు వేస్తున్న బెడ్‌షీట్లను మార్చాలని సూచించారు. రోగులకు అందించే ఆహారానికి స్పష్టమైన మెనూ ఏర్పాటు చేయాలని సూచించారు.

వైద్య సేవలపై రోగులు అభిప్రాయాలు చెప్పేందుకు ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వార్డుల్లో పర్యటించిన కలెక్టర్, చికిత్స పొందుతున్న రోగుల దగ్గరకు వెళ్లి వైద్య సేవలపై స్పందనను అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా ఫైర్ ఎక్స్టింగ్విషర్‌ల గడువు ముగిసినట్లు గుర్తించిన కలెక్టర్, ఇప్పటి వరకు ధృవీకరణ ఎందుకు తీసుకోలేదని పర్యవేక్షకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను భద్రపరచడం కోసం జిల్లా వైద్య శాఖ ఆధీనంలో ఖాళీగా ఉన్న భవనాన్ని వినియోగించాలని సూచించారు. ప్రతి రోజు ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, రోజుకు దాదాపు వెయ్యి మందికిపైగా వైద్యసేవలు అందుకుంటున్నారని పర్యవేక్షకులు డా. రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రసూతి విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రతి నెల 160-180 ప్రసవాలు జరుగుతున్నాయని వైద్యులు తెలిపారు. అందులో సాధారణ ప్రసవాలు, సిజేరియన్‌ల వివరాలు, ప్రమాదకర కేసులను ఎక్కడికి రిఫర్ చేస్తున్నారన్న అంశాలను కూడా కలెక్టర్ వివరంగా ఆరా తీశారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ ఉపయోగించటం లేదని గుర్తించి, లీకేజీల కారణంగా వినియోగం ఆగిపోయిందని వైద్యులు వివరిగా తెలియజేయగా, వెంటనే మరమ్మతులు చేసి సేవల్లోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, రోగుల భద్రత, నాణ్యమైన వైద్యసేవలు నిర్దేశిత విధానంలో అమలు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఆర్ ఎం ఓ దివ్య అని విభాగాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అభివృద్ధి పనులలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం అభివృద్ధి పనులలో పురోగతి, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ, పంచాయతీరాజ్, కాటారం సబ్ కలెక్టర్, విద్యుత్, ఈఓ కాళేశ్వరం, డీపీఓ, సీపీఓ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ -1, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధి పనులలో అమలు వేగాన్ని పెంచాలని, నాణ్యత పర్యవేక్షణలో ఎక్కడా రాజీ పడరాదని ఆదేశించారు. పెండింగ్ పనులను సమయానికి పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తాజా అప్‌డేట్లతో, ప్రగతి నివేదికలు, అవసరాలు, పెండింగ్ సమస్యలు, అలాగే ఫీల్డ్ పనులకు సంబంధించిన ఫోటో డాక్యుమెంటేషన్ అందించేయాలి కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులతో సమన్వయంతో పనులను క్రమం తప్పకుండా పరిశీలించి, నాణ్యతగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారా సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, దేవాదాయ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఇరిగేషన్, ప్రణాళిక తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

# బాల్యవివాహాల నిర్మూలన గురించి అవగాహన



భూపాలపల్లి, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి ఆదేశాల మేరకు భూపాలపల్లి మండలంలోని కేజీబీవి జంగేడు పాఠశాలలో డి హెచ్ డబ్ల్యూ, సిహెచ్ఎల్,సఖి సమన్వయంతో బాల్యవివాహాల నిర్మూలన గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, బేటి బచావో బేటి పడావో, ఆడపిల్లల చదువు, రక్షణ, బాలల హక్కులు, సోషల్ మీడియా ప్రతికూలత మరియు మహిళల సమస్యలపై %ణఎజుఔ% అనూష చైల్డ్ హెల్ప్ లైన్ కళావతి, సాయిరాం, సఖి మాధవి మరియు కెబీజీవీ ఎస్ ఓ ఈశ్వరి, టీచర్స్ బాలికలు పాల్గొనడం జరిగింది.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిక్షపతిని పరామర్శించిన బడే నాగజ్యోతి



ములుగు, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): ములుగు మండలంలోని కన్నాయిగూడెం గ్రామానికి చెందిన పావురాల బిక్షపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ములుగు రోడ్డు లోని లలిత హాస్పిటల్ లో చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి, ధైర్యంగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి తెలిపారు. తన భార్య పావురాల సుమలత రోడ్డు ప్రమాదంలో చనిపోవడం దురదృష్టకరమని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. పావురాల బిక్షపతి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి, చెన్న విజయ్, దొడ్డపల్లి రఘుపతి, కొమురం సిద్దు, తదితరులు ఉన్నారు.

# విద్యారంగ సమస్యలను పరిష్కరించని ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

**పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలి**

**ఎమ్మెల్యే నాయిని క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ**




హనుమకొండ, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పట్టించుకోని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు స్టాలిన్ మంద శ్రీకాంత్ ఉన్నారు. మంగళవారం రోజున ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంప్ ఆఫీసు ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు దొంగ హామీలు ఇచ్చి గద్దనెక్కారు అన్నారు గత మూడు సంవత్సరాల నుండి తెలంగాణ రాష్ట్రంలో 8,150 కోట్ల దాకా స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్మెంట్ పెండింగ్లో ఉంది అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో చదివే విద్యార్థులకు సర్టిఫికెట్స్ తీసుకుందామంటే ప్రభుత్వం నుండి డబ్బులు రాలేదని విద్యా సంస్థల యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. గత నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు పిజి కళాశాలలు ఇంజనీరింగ్ కళాశాలలు రాష్ట్రంలో బందుకు బందుకు పిలుపునిస్తే రాష్ట్ర ప్రభుత్వం వారితో చర్చలు జరిపి ,1200 కోట్ల రూపాయలను రెండు దఫాలుగా విడుదల చేస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా మోసం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్య రంగ సమస్యల పై అలాగే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ ను మరియు ఫీజు రియంబర్స్మెంట్ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ హేమంత్ బొచ్చు ఈశ్వర్ చెన్నూరి సాయికుమార్ మల్లేష్ ఎండి, ఇస్మాయిల్ రాకేష్ రెడ్డి పవన్ కుమార్ అభిషేక్ అరుణ్ సందీప్ సూరజ్ రాహుల్ రణదీప్ అరుణ్ కుమార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి కెనాల్ దగ్గర ఎన్హెచ్ రహదారి మూసివేత

**వాహనాల మళ్లింపుకు సూచనలు : ఎన్ హెచ్ ఏఈ చైతన్య**

ములుగు, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా మల్లంపల్లి సమీపంలోని ఎస్సారెస్పీ కెనాల్ వద్ద జాతీయ రహదారి (ఎన్హెచ్) బ్రిడ్జి నిర్మాణం సందర్భంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాతీయ రహదారిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వానదారులు సహకరించాలని నేషనల్ హైవే ఏఈ చైతన్య మంగళవారం తెలిపారు. కెనాల్ వద్ద రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృష్ట్యా వాహనాల రాకపోకలతో ఇబ్బందులు జరుగుతున్నందున ఒక్కరోజు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ములుగు నుండి హనుమకొండ వెళ్లే వాహనాలు భారీ వాహనాలు అబ్బాపూర్ మీదుగా చిన్న వాహనాలు భూపాల్ నగర్ మీదుగా వెళ్లాలని, అదేవిధంగా హనుమకొండ నుంచి వచ్చే భారీ వాహనాలు గూడెపాడ్ వయా పరకాల మీదుగా చిన్న వాహనాలు శ్రీనగర్ భూపాల్ నగర్ మీదుగా ములుగు వెళ్లాలని ఆయన తెలిపారు. వాహనాలదారులు సహకరించాలని ఆయన కోరారు.



# జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయంలో జాబ్ మేళ

**జిల్లా ఉపాధి అధికారి టి.రజిత**



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మహబూబాబాద్ లో ఖాళీగా ఉన్న డెవలప్మెంట్ మేనేజర్, టీం లీడర్, లైఫ్ మిత్ర పోస్టుల భర్తీకి అర్హత కల్గిన స్త్రీ/పురుష అభ్యర్దులకు ఉద్యోగవకాశాలను కల్పించుటకు తేది: 06.11. 2025 న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత నేడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నియామకాలు పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ విధానంలో ఉండునని, హౌస్ వైఫ్స్, రిటైర్డ్ ఎంప్లాయీస్, నిరుద్యోగులు మరియు ఫ్రెషర్స్ ఎవరైనా ఈ జాబ్ మేళాకు హాజరవవచ్చునని, అభ్యర్థులు 25 నుండి 60 సంవత్సరాల లోపు వయసు కలిగి ఎస్.ఎస్.సి ఇంటర్ ఆ పైన చదువులు కలిగిన వారు మహబూబాబాద్ జిల్లా పరిధిలో పనిచేయుటకు అవకాశం కల్పించబడునని తెలిపారు. అర్హత, ఆసక్తి కల్గిన అభ్యర్దులు తేది: 06.11 .2025 న ఉదయం 10.30 గం. ల నుండి మద్యాహ్నం 2.00 గం.ల వరకు కురవి రోడ్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(నూతన కలెక్టరేట్) లోని రెండవ అంతస్తు, రూమ్ నెంబర్ 25, జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం లో జరుగు జాబ్ మేళాకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్ తో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు. మదార్, ఫోన్ నెం. 9866575716 ద్వారా సంప్రదించి వివరాలు పొందవచ్చునని తెలిపారు.

# పాలిటెక్నిక్ వసతి గృహాలకు నిధులు మంజూరు

## రాష్ట్ర ముఖ్యమంత్రి, వనపర్తి ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు



వనపర్తి, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాల నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య శాఖ హైయర్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ నుంచి 13. 15 కోట్లు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు నిధుల మంజూరు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేసిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డికి వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండా శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ సర్కార్ వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి కోసం జీవో నెంబర్ 169 విడుదల చేసిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇప్పటికే విద్య రంగంలో రాష్ట్రంలోనే సాంకేతిక విద్యకు పెద్దపీట వేసిన వనపర్తి జిల్లా పాలిటెక్నిక్ కళాశాల చరిత్రలో ఒక మైలురాయి దాటిందని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ చదువుకున్న అనేకమంది పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు దేశ దేశాలలో శాస్త్రవేత్తలుగా ఇంజనీర్లుగా డాక్టర్లుగా కొంతమంది రాజకీయ నాయకులుగా మరికొంతమంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ వనపర్తి చరిత్రను నిలబెట్టడం గర్వకారమని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఇప్పటికే వనపర్తి "విద్యా పర్తి"గా పేరు తేవడంలో వనపర్తి ఎమ్మెల్యే కృషి ప్రశంసనీయమని అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిన్ననాటి బాల్యం విద్య తన చదువు ఇక్కడ చదువుకోవడం పట్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం విద్యార్థుల సంక్షేమం కోసం ఆనాడే చదువు కష్టం నష్టం బాధలు తెలిసిన ముఖ్యమంత్రి వనపర్తి జిల్లా పై వనపర్తి నియోజకవర్గం వర్గంపై ప్రత్యేక ప్రేమ చూపిస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు ఎప్పటికప్పుడు పాస్పోర్ట్ చార్జీలు పెంచి డబ్బులు విడుదల చేస్తూ విద్యార్థులు పై చదువులు చదువుకోవాలని ముఖ్యమంత్రి తపనతో కృషి చేస్తున్నారని అన్నారు. వనపర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో గత కొన్ని నెలల క్రితం ఇక్కడ చదువుకున్న పూర్వపు విద్యార్థి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలోని వసతి గృహాల సమీపంలో ఆయన తొలి అడుగు పెట్టిన విషయం గుర్తు చేశారు. అందుకే ముఖ్యమంత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలోని వసతి గృహాల నిర్మాణం కోసం ఈ నిధులు విడుదల చేయడం శుభ సూచకమని అన్నారు. ఈ నిధులు విడుదల కోసం కృషిచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహా, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, వనపర్తి ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో కూడా వనపర్తి అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. విద్యాపరంగా వనపర్తికి ఎంతో పేరు ఉందని అందుకే ఇక్కడ అనేకమంది ఇతర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కేజీ నుంచి పీజీ వరకు విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలలో ఉన్న విషయం ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లోనే విద్యారంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం కృషి చేస్తుందని వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

# పిడిఎస్యు 23వ మహాసభలను జయప్రదం చేయండి

## మహాసభల లోగో ఆవిష్కరించిన ప్రొ. కాత్యాయని విద్మహే




హనుమకొండ కేయు, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): డిసెంబర్ 10,11,12 తేదీల్లో జరిగే పిడిఎస్యు రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో మహాసభ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పిడిఎస్యు రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి మైసా శ్రీనివాస్ మాట్లాడుతూ చారిత్రాత్మక పోరాట వారసత్వం ఉన్న పిడిఎస్యు రాష్ట్ర మహాసభలు ఉద్యమాల కేంద్రం వరంగల్ జిల్లాలో నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల విద్య పేదలకు మరింత దూరం అవుతుందన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికీ విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు పేద బడుగు బలహీన వర్గాలకు అందకుండా ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించుకుంటున్నాయన్నారు. పాలకులు కార్పొరేట్, పెట్టుబడేదారులకు ఊడిగం చేసేందుకే ప్రభుత్వాలను నడుపుతున్నాయన్నారు. ప్రభుత్వ విద్యారంగం ధ్వంసం అవుతుందని అనేక పాఠశాలలు కళాశాలలు యూనివర్సిటీలు మూసివేత గురి అవ్వడమే దీనికి తార్కాణం అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోనే ఉన్న చట్టాలను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ ప్రైవేటుపరం అయ్యాయని, విద్యా రంగాన్ని కూడా పూర్తిగా ప్రవేట్ పరం చేసేందుకు నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకొచ్చిందన్నారు. దీంతో దేశంలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో కోర్స్ ఫీజులు ఎగ్జామినేషన్ ఫీజులు పెరిగి ఆర్థిక భారంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు. విద్యార్థుల మెదలను కలుషితం చేయడం కోసం పాఠ్యాంశాల్లో మూఢనమ్మకాలను, మతోన్మాదం ను చెప్పిస్తుందన్నారు. ఎన్సీఈఆర్టీ పాఠ్యాంశాల్లో గాంధీని చంపిన గాడ్సే పాఠాలను తీసివేయడం చరిత్ర వక్రీకరణలో భాగమే అన్నారు. ప్రపంచంలో వివిధ దేశాల్లో విద్యార్థులు యువకులు విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నడుస్తున్నాయన్నారు. విద్యార్థుల పోరాటాలతో ఆఫ్ఘనిస్తాన్ బంగ్లాదేశ్ శ్రీలంక నేపాల్ లాంటి దేశాల్లో ప్రభుత్వాలే కూలిపోయాయని అన్నారు. అంతర్జాతీయ విద్యార్థి ఉద్యమాల స్ఫూర్తితో దేశం విద్యార్థులోకం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్,శ్రీపాద శ్రీహరి,రంగవల్లి కోలాశంకర్, దుస్సా చేరాలు లాంటి ఎందరో విద్యార్థి అమరవీరుల త్యాగంతో పురుడోసుకున్న పిడిఎస్యు సంస్థ విద్యార్థుల ఉద్యమాన్నీ తీవ్రతరం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కనీసం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ కూడా విద్యార్థులకు ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తుందన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. పాలకులు మారిన వారి విధానాలు మారకపోవడం వల్ల విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడంలేదని అన్నారు. విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం సమరశీల ఐక్య ఉద్యమాలు చేయాలన్నారు. డిసెంబర్ 10 10న ఆర్ట్స్ కాలేజ్ ఆల్టోరియం ముందు బహిరంగ సభ,11 ,12 తేదీల్లో అబ్బాస్ ఫంక్షన్ హాల్లో జరిగే ప్రతినిధుల సభలను జయప్రదం చేయాలని విద్యార్థులకు, మేధావులకు,ప్రజాస్వామ్యవాదులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో పిడిఎస్యు జాతీయ నాయకులు పి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, డాక్టర్ రాజేష్, పిడిఎస్యు వరంగల్ జిల్లా అధ్యక్షులు గుర్రం అజయ్, ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, సి.పి.ఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, పి.డి.ఎస్.యూ మాజీ నాయకులు బాలరాజు, బండి కోటేశ్వర్, మాజీ పిడిఎస్యు నాయకులు వెంకట్ రమణ, అనిల్ రాజేష్, ప్రకాష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వం



హనుమకొండ కేయు, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): పెండింగ్ లో ఉన్న 8300 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి అన్నారు. మంగళవారం కేయూ క్యాంపస్ లోని వి ఆర్ ఎస్ హాస్టల్ ముందు స్కాలర్స్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్లో ఉన్న ఫీజు బకాయిలను ఇప్పటివరకు విడుదల చేయకుండా మాటలతో పబ్బం గడుపుతుందని, ఫీజులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని,గతంలో ప్రైవేటు యజమాన్యాలు ఫీజు ల విడుదల చేయాలని ఆందోళన చేసిన నేపథ్యంలో రెండు విడతలుగా 1200 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం, విడుదల చేయకుండా మాట మార్చిందని విమర్శించారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చలేకుండా ప్రభుత్వం దాటవేసిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి విద్యార్థుల సంక్షేమ పట్ల చిత్తశుద్ధి లేదని, అందుకనే ఫీజు విడుదలలో జాప్యం చేస్తుందని అన్నారు, ఫీజులు విడుదల చేయాలని కోరితే విజిలెన్స్ దాడులకు ఆదేశాలు ఇవ్వడం సిగ్గుమాలిన దుశ్చర్య అన్నారు. ఫీజులు విడుదల చేయమంటే కక్ష సాధింపు చర్యలు పాల్పడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పెండింగ్లో ఉన్న ఫీజులను విడుదల చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలతో చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ స్కాలర్స్ నేతలు కందికొండ తిరుపతి, కేతపాక ప్రసాద్, గుండేటి సుమన్, ఏ.సూర్య కిరణ్ లు పాల్గొన్నారు.

# వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి



సంగెం, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): మంగళవారం హనుమకొండ జిల్లా సంగెం మండలం బిక్కోజి నాయక్ తండా గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గ్రామ ప్రజలు ఐటీడీఏ సంబంధిత అధికారులతో కలిసి దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, రోడ్డు మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లలో సమన్వయంతో పని చేయాలి

## జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్



మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): ఖరీఫ్ (రబీ) సీజన్ 25- 26, ధాన్యం కొనుగోళ్లలో అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర రైతు వేదికలో జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ క్రిష్ణవేణి, పెద్దవంగర, తొర్రూరు తహసీల్దారులు, మహేందర్, శ్రీనివాస్ సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు నిర్వహణ తీసుకోవలసిన జాగ్రత్తలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ 25-26, సీజన్లో ధాన్యం సేకరణ కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ, రవాణా, కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాట్లు, జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేసే ధాన్యాన్ని రవాణా చేసే విషయంలో రైస్ మిల్లర్లు, కాంట్రాక్టర్స్, హమాలీలు, రైతులు కేంద్రాల నిర్వహణ సిబ్బంది పగడ్బందీగా చర్యలు తీసుకుని ముందుకు సాగాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సూచనల ప్రకారం ఏర్పాట్లు చేయాలన్నారు. సహకార శాఖ, ఐకెపి, గిరిజన కార్పొరేషన్, తదితర ఏజెన్సీల ద్వారా ఏర్పాటుచేసిన కేంద్రాలలో ధాన్యం కొనుగోళ్ల అంశం రైతులకు పూర్తి అవగాహన కల్పించి రైతులను చైతన్యపరిచాలన్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం రవాణా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకొని ధాన్యాన్ని పరిరక్షించాలని సూచించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తీసుకుంటున్న చర్యల గురించి హాజరైన సిబ్బంది నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా రైతులతో ప్రేమ పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక రెవెన్యూ, సహకార, వ్యవసాయ, పౌరసరఫరాలు, రైస్ మిల్లర్లు కాంట్రాక్టర్స్, హమాలీలు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భూసార పరీక్ష పత్రాల పంపిణీ

## ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన




కన్నాయిగూడెం, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు మరియు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి సార్ , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కంతనపల్లి రైతులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ఆయిల్ పామ్ పంట సాగు వివరాలు, మరియు భూసార పరీక్ష పత్రాల ఆవశ్యకతను రైతులకు వివరించారు. అనంతరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏటూరునాగారం జే అవినాష్ వర్మ మరియు వ్యవసాయ అధికారి ముంజ మహేష్ లు మంత్రి మరియు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి ఆదేశాల మేరకు కంతనపల్లి రైతులకు భూసార పరీక్ష పత్రాల పంపిణీ చేయడం జరిగింది. అంతేకాకుండా భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించడం జరిగింది. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు కళ్యాణి, ప్రియాంక మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో పోలీస్ శాఖ కీలక నిర్ణయం

**ప్రమాదాలపై వచ్చేనెల నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో రోజురోజుకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో తెలంగాణ పోలీస్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రోడ్డు ప్రమాదాలపై వచ్చేనెల నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాద బాధితులను మంగళవారం డీజీపీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ బస్సు ప్రమాదం జరిగిందన్నారు. రోడ్డు పరిస్థితిని బట్టి స్పీడ్ నియంత్రణ ఉండాలన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని దర్యాప్తు తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఓఆర్ఆర్, నేషనల్ హైవేలపై హైస్పీడ్ కు అనుమతి ఉందని అక్కడ వాహనాలు నడిపిన డ్రైవర్లు సాధారణ రోడ్లపై కూడా అదే స్పీడ్ తో వెళ్తున్నారని ఇది సరైనది కాదన్నారు. వాహనదారుల అతివిశ్వాసం సరికాదన్నారు.

# ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు

**నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు**

**ప్రభుత్వంపై కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు**



ఆదిలాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన "జనం బాట" కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కవిత మీడియాతో మాట్లాడుతూ "నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు, జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు అని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి అని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలి అని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలి అని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కీలక పరిణామం




హైదరాబాద్, నవంబర్ 04 (తీన్మార్ న్యూస్): జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ మద్దతు ప్రకటించింది. మంగళవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలతో తెలంగాణ జనసేన అధ్యక్షుడు శంకర్ గౌడ్ మరియు పలువురు పార్టీ రాష్ట్ర నాయకులు భేటీ అయ్యారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటామని హామీ ఇచ్చారు. కాగా, జూబ్లీహిల్స్‌లో పోలింగ్‌కు ఇంకా ఆరు రోజులే ఉండటంతో ప్రచారం మరింత వేడెక్కింది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన అగ్రనేతలు రంగంలోకి దిగ ప్రచారం చేస్తున్నారు. లంకల దీపక్ రెడ్డి తరఫున కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. పాదయాత్ర ద్వారా ఇంటింటికీ వెళ్లి బీజేపీకి ఓటు వేయాలంటూ ఆయన ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

# ట్రంప్ సుంకాలపై న్యాయవిచారణ

- సుప్రీంలో వ్యాపారుల సవాల్
- నేడు విచారణ జరుగున్నట్లు వార్తలు



**వాషింగ్టన్, నవంబర్ 4:** అమెరికా చరిత్రలోనే అత్యంత కీలకమైన న్యాయవిచారణకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు సిద్ధమవుతోంది. టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధం సాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాలను నిర్ణయించే అంశంపై న్యాయస్థానం అమెరికా కాలమానం ప్రకారం బుధవారం విచారణ జరపనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ట్రంప్ మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ఈ సుంకాలు విధించారని అమెరికా సర్కారు తెలిపింది. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరగనుంది. ఈ కేసులో ట్రంప్‌నకు వ్యతిరేకంగా భారత సంతతి అటార్నీ నీల్ కత్యాల్ వాదనలు వినిపించనున్నారు. దీంతో ఆయన పేరు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియాలో మార్మోగుతోంది. 54 ఏళ్ల నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులను వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలున్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ కేసు విచారణకు ట్రంప్ ప్రత్యక్షంగా హాజరుకావాలని తొలుత భావించారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రభుత్వం తరఫున ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ హాజరుకానున్నారు. ఈ కేసు విచారణపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇందులో మేం గెలిస్తే.. ప్రపంచంలోనే అత్యంత సంపన్న, సురక్షితమైన దేశంగా అమెరికా నిలుస్తుంది. ఒకవేళ ఓడిపోతే పేద దేశంగా మారుతుంది. అలా జరగొద్దని భగవంతున్ని కోరుకుంటున్నా అని రాసుకొచ్చారు.

# బెంగాల్లో సర్‌కు వ్యతిరేకంగా మమత గళం

**కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహణ**

**ఎన్నికల సంఘం తీరుపై ఆగ్రహం**



**కోల్‌కతా,నవంబర్ 4:** బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం విరుచుకుపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ బెంగాలీ మాట్లాడే పౌరులను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన 'నిశ్శబ్ద రిగ్గింగ్' అని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మంగళవారనాడు కోల్‌కతా వీధుల్లో భారీ ర్యాలీని మమత ముందుండి నడిపించారు. ఆమె మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యుడు అభిషేక్ బెనర్జీ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ టైమ్‌లైన్ పెట్టుకుని మరీ ఇంత హడావిడిగా ఎస్ఐఆర్ నిర్వహించడాన్ని మమతా బెనర్జీ తప్పుపట్టారు. బెంగాల్‌లో 2022లో ఓటర్ రివిజన్ జరిగిందని, అందుకు రెండేళ్లు పట్టిందని అన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ పక్రియ నెలరోజుల్లోనే పూర్తిచేయాలనుకుంటున్నారని అన్నారు. ఈసీ పారదర్శకత్వను ప్రశ్నిస్తూ... బిహార్ ఎస్ఐఆర్‌లో ఎంతమంది రోహింగ్యాలు, బంగ్లాదేశీయులను గుర్తించారో చెప్పాలన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల జాబితా నుంచి అర్హులైన ఒక్క ఓటరును తొలగించినా బీజేపీ ప్రభుత్వ పతనాన్ని తమ పార్టీ చూస్తుందని మమత హెచ్చరించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్‌తో కేంద్రం కుమ్మక్కై ఎస్ఐఆర్ పక్రియను ఒక ఉపకరణంగా వాడుకుంటోందని విమర్శించారు. హిందీ, పంజాబీ మాట్లాడే వాళ్లు ఎలా పాకిస్థానీయులు కాదో బంగ్లా మాట్లాడే వాళ్లు బంగ్లాదేశీయులు కాదని మమత అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను బీజేపీ భయపెట్టే ప్రయత్నం చేస్తోందని, ఈ భయాలతోనే ఇప్పటికే ఏడుగురు ప్రాణాలు తీసుకున్నారని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అన్నారు. లీగల్ ఓటర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగిస్తే ఢిల్లీలో మెగా నిరసనకు మద్దతుదారులంతా సిద్ధంతా ఉండాలని కోరారు. కాగా, టీఎంసీ నిరసనలపై బీజేపీ మండిపడింది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీ ఇదని ఆక్షేపణ తెలిపింది. అక్రమ వలసదారులను తమ ఓటు బ్యాంకుగా చేసుకున్న మమతా బెనర్జీ ఇప్పుడు వారికి రక్షణ కల్పిస్తున్నారని బీజేపీ ప్రతినిధి అమిత్ మాలవీయ ఆరోపించారు.

# బీహార్ ఎన్నికల్లో వివాదాస్పద వ్యాఖ్యలు

**కేంద్రమంత్రి లలన్ సింగ్‌పై కేసు నమోదు**



**పాట్నా,నవంబర్ 4:** బిహార్ ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి, జేడీయూ నేత లలన్ సింగ్ పై పాట్నా జిల్లా యంత్రాంగం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీడియా నిఘా టీమ్ నుంచి ఫుటేజ్‌ను సమీక్షించిన అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, ప్రజాప్రాతినిధ చట్టం కింద లలన్ సింగ్‌పై అధికారులు కేసు నమోదు చేశారు. మొకామా ప్రాంతంలో జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ తరఫున లలన్ సింగ్ ఇటీవల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా పోలింగ్ రోజున విపక్ష నేతలను ఇళ్ల నుంచి బయటకు రానీయరాదని, ఇళ్లకు తాళాలు వేయాలని సూచించారు. నాయకులను ఓటు వేయకుండా అడ్డుకోవాలని, వాళ్లు ఒకవేళ రచ్చచేస్తే ఓటు వేయడానికి తీసుకు వెళ్లి తిరిగి ఇంటికే పరిమితం చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, కేంద్ర మంత్రి మాట్లాడిన వీడియోను ఆర్జేడీ ప్రతినిధి ప్రియాంక భారతి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఎన్నికల కమిషన్‌ను బలహీనపరిచేలా లలన్ సింగ్ చర్యలు ఉన్నాయని, బహిరంగంగా ఓటర్లను కేంద్ర మంత్రి బెదిరిస్తుంటే ఈసీ ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. మొకామాలో ఇటీవల దులార్ చంద్ యాదవ్ అనే జన్‌సురాజ్ కార్యకర్త హత్యకు గురికావడంతో అనంత్ సింగ్‌ను పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన బేవుర్ జైలులో ఉన్నారు.




# అమెరికా బాటలో కెనడా

**భారీగా విద్యార్థి వీసాలు తిరస్కరణ**



**టోరంటో, నవంబర్ 4:** అమెరికా దారిలోనే కెనడా నిర్ణయాలు కూడా ఉంటున్నాయి. కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. దీంతో భారతీయ విద్యార్థుల విషయంలో తీవ్రంగా వ్యవహరిస్తున్నట్లు అర్థం అవుతోంది. కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

# రోజూ పరగడుపునే దొండకాయల జ్యూస్‌ను తాగితే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!



ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలకు చెందిన వారు తినే కూరగాయల్లో దొండకాయలు కూడా ఒకటి. భారత్‌తోపాటు ఆసియా దేశాలకు చెందిన వారు దొండకాయలను ఎక్కువగా తింటుంటారు. వీటినే కుంద్రు, తిండోరా అని కూడా పిలుస్తారు. దొండకాయలు మనకు పలు రకాల వెరైటీల్లో లభిస్తుంటాయి. వీటితో వేపుడు, పచ్చడి వంటివి చేసుకుంటారు. టమాటాలతో కలిపి వండినా ఎంతో రుచిగా ఉంటాయి. దొండకాయల్లో క్యాలరీలు చాలా స్వల్పంగా ఉంటాయి. వీటిల్లో అనేక రకాల విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి మనకు పోషణను, ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఈ క్రమంలోనే దొండకాయలను తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చని అంటున్నారు.

**డయాబెటిస్ ఉన్నవారికి..**

దొండకాయలను తినడం వల్ల షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. దొండకాయ జ్యూస్‌ను రోజూ ఉదయం పరగడుపునే తాగుతుండాలి. దీని వల్ల శరీరం ఇన్సులిన్‌ను మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో గ్లూకోజ్ మెటబాలిజం మెరుగు పడుతుంది. షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో ఉపశమనం లభిస్తుంది. దొండకాయల్లో ఫైబర్ అధికంగా, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కనుక బరువు తగ్గాలనుకునే వారికి ఇవి ఎంతో మేలు చేస్తాయి. వీటి జ్యూస్‌ను రోజూ తాగుతుంటే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. దొండకాయలను తినడం వల్ల శరీరం మెటబాలిజం మెరుగు పడుతుంది. క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.

**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**

దొండకాయల్లో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా మలబద్దకం తగ్గుతుంది. ఇవి ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. అందువల్ల వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. దొండకాయల్లో విటమిన్లు సి, ఎ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఆక్సిడెంట్లలా పనిచేస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. ఈ కాయల్లో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాల వల్ల ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, సాపోనిన్స్ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గిస్తాయి. రక్త నాళాల వాపులు, కీళ్ల నొప్పులు, వాపులు తగ్గుతాయి. దీని వల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది.

**గుండె పనితీరుకు..**

దొండకాయలను తింటే పొటాషియం అధికంగా లభిస్తుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని అదుపులో ఉంచుతుంది. దీని వల్ల హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. దొండకాయల జ్యూస్‌ను రోజూ తాగితే ఐరన్ అధికంగా లభిస్తుంది. ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. నీరసం, అలసట తగ్గిపోతాయి. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యానికి కూడా ఇవి పనిచేస్తాయి. శరీరంలో శక్తి స్థాయిలను పెంచుతాయి. ఇలా దొండకాయలను రోజూ తింటున్నా లేదా వాటి జ్యూస్‌ను సేవిస్తున్నా కూడా మనకు ఎన్నో లాభాలు కలుగుతాయి. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.



# పీసీవోఎస్ ఉన్న మహిళలు ఈ ఆహారాలను రోజూ తీసుకోవాలి.. ఎంతో ఫలితం ఉంటుంది..

ప్రస్తుతం చాలా మంది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతోంది. హార్మోన్ల సమస్యలను చాలా మంది మహిళలు ఎదుర్కొంటున్నారు. దీని వల్ల నెలసరి సరిగ్గా రాకపోవడం, థైరాయిడ్, సంతాన లోపం వంటి సమస్యలు వస్తున్నాయి. మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడితే అది దీర్ఘకాలంలో పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ (పీసీవోఎస్) అనే సమస్యకు దారి తీస్తుంది. దీన్నే పీసీవోడీ అని కూడా వ్యవహరిస్తారు. ఈ వ్యాధి వచ్చిన మహిళలో రుతు క్రమం సరిగ్గా ఉండదు. రుతుక్రమం అయినప్పుడు అధిక రక్తస్రావం అవుతుంది. శరీరంపై అవాంఛిత రోమాలు వస్తాయి. మొటిమలు ఎక్కువగా వస్తుంటాయి. నెలసరి సరిగ్గా ఉండని కారణంగా సంతానం కలగడం ఆలస్యం అవుతుంది. లేదా సంతాన లోపం ఏర్పడుతుంది. అయితే పీసీవోఎస్ సమస్య ఉన్న మహిళలు డాక్టర్లచే చికిత్స తీసుకోవాలి. క్రమం తప్పకుండా మందులను వాడాల్సి ఉంటుంది. అలాగే ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకుంటే ఎంతో ఫలితం ఉంటుంది.

**పాలు, పాల ఉత్పత్తులు, మాంసం మానేయాలి..**

పీసీవోఎస్ ఉన్న మహిళలు పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, చేపలు, రొయ్యలు, కోడిగుడ్లు వంటి ఆహారాలను మానేయాలి. వెజిటేరియన్ ఆహారాలనే అధికంగా తీసుకోవాలి. ఈ సమస్య మహిళలు రోజూ క్యారెట్, బీట్ రూట్, పాలకూరను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ మూడింటినీ కలిపి జ్యూస్‌లా చేసి రోజూ ఒక కప్పు మోతాదులో తాగవచ్చు. ఉదయం లేదా రాత్రి ఏ సమయంలో తాగినా సరే ఉపయోగం ఉంటుంది. ఈ జ్యూస్ వల్ల హార్మోన్ల సమస్యలు తొలగిపోతాయి. రక్తం శుద్ధి అవుతుంది. గర్భాశయానికి జరిగే నష్టం నివారించబడుతుంది. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి. మెంతులు, వాము, పప్పు దినుసులు, సూప్‌లను ఎక్కువగా తీసుకోవాలి. మెంతులను రోజూ నీటిలో నానబెట్టి తీసుకోవచ్చు. వాము నీళ్లను తాగవచ్చు. కందిపప్పు, పెసలు వంటి వాటిని తరచూ తినాలి. ఈ విధంగా చేస్తుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

**విత్తనాలు..**

పీసీవోఎస్ ఉన్నవారు చియా విత్తనాలను రోజూ గుప్పెడు మోతాదులో నీటిలో నానబెట్టి తింటుండాలి. లేదా అవిసె గింజలను గుప్పెడు తీసుకుని పెనంపై వేయించి తినవచ్చు. గుమ్మడికాయ విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, నువ్వులు కూడా అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని నీటిలో నానబెట్టి లేదా పెనంపై వేయించి తినవచ్చు. ఈ విత్తనాల్లో ఉండే ప్రోటీన్లు మహిళలకు ఎంతో మేలు చేస్తాయి. హార్మోన్ల సమస్యలను తగ్గిస్తాయి. అలాగే శక్తి లభించేలా చేస్తాయి. అదేవిధంగా జీలకర్ర నీళ్లను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. సోంపు గింజలను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవచ్చు. దీని వల్ల హార్మోన్ల సమస్యలు తగ్గడమే కాదు, మూత్రాశయ ఇన్‌ఫెక్షన్ల నుంచి బయట పడవచ్చు. ధనియాల నీళ్లను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. యాలకుల పొడిని గోరు వెచ్చని నీటిలో కలిపి తాగాలి. హార్మోన్ల సమస్యలను తగ్గించడంలో ఇవి కూడా అద్భుతంగా పనిచేస్తాయి.

**పండ్లు..**

మహిళలు రోజూ దానిమ్మ పండ్లు, నల్ల ద్రాక్షలను తినడం వల్ల మేలు జరుగుతుంది. వీటి వల్ల రక్త శుద్ధి అవుతుంది. గర్భాశయానికి పోషకాలు సరిగ్గా లభిస్తాయి. దెబ్బ తిన్న కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. దీని వల్ల కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. హార్మోన్ల సమస్యలు తగ్గుతాయి. పీసీవోఎస్ నుంచి త్వరగా బయట పడవచ్చు. ఈ సమస్య ఉన్న మహిళలు ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉన్నా కూడా హార్మోన్ల సమస్యలు వస్తాయి. వాటిని తగ్గించేందుకు గాను యోగా, ధ్యానం వంటివి చేయాలి. రోజూ కనీసం 30 నిమిషాల పాటు తేలికపాటి వాకింగ్ చేస్తున్నా ఉపయోగం ఉంటుంది. శ్వాస వ్యాయామాలు కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. అలాగే ఉష్ట్రాసనం, నౌకాసనం, బద్ధ కోణాసనం వంటి ఆసనాలను వేస్తున్నా కూడా మహిళలు హార్మోన్ల సమస్యలను తగ్గించుకోవచ్చు. పీసీవోఎస్ నుంచి బయట పడతారు. ఆరోగ్యంగా ఉంటారు.

# మీ పిల్లలకు తరచూ దగ్గు, జలుబు వస్తున్నాయా..?

## ఈ చిట్కాలను పాటిస్తే వారిలో రోగ నిరోధక శక్తిని పెంచవచ్చు..!



సీజన్లు మారినప్పుడు లేదా వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు సహజంగానే ముందుగా చిన్నారులకు దగ్గు, జలుబు, జ్వరం వస్తుంటాయి. రోగ నిరోధక శక్తి వారిలో తక్కువగా ఉంటుంది కనుక ఇలా జరుగుతుంది. దీంతో వారు తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కొంటారు. రోగ నిరోధక శక్తి ఇంకా తక్కువ ఉండే చిన్నారులు హాస్పిటల్ పాలు కావల్సి వస్తుంది. అయితే కొన్ని రకాల ఇంటి చిట్కాలను పాటించడం వల్ల వారిలో రోగ నిరోధక శక్తి పెరిగేలా చేయవచ్చు. దీంతో సీజన్లు మారినప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. చలికాలంలోనూ ఈ చిట్కాలు అద్భుతంగా పనిచేస్తాయి. ఈ సీజన్‌లోనూ చిన్నారులకు తరచూ దగ్గు, జలుబు వస్తుంటాయి. కనుక ఈ చిట్కాలను పాటిస్తే ఉపయోగం ఉంటుంది. మన ఇంట్లో లభించే పదార్థాలతోనే ఆయా చిట్కాలను పాటించడం వల్ల చిన్నారుల్లో సహజసిద్ధంగానే రోగ నిరోధక శక్తిని పెంచవచ్చు. ఇందుకు ఎలాంటి మెడిసిన్లను వాడాల్సిన అవసరం లేదు.

**పసుపు, తేనె..**

చిన్నారుల ఆరోగ్యానికి పసుపు, తేనె ఎంతో మేలు చేస్తాయి. ఇవి అద్భుతమైన లాభాలను అందిస్తాయి. పసుపు వల్ల రక్త నాళాల వాపులు తగ్గుతాయి. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తేనె కూడా ఈ విషయంలో అద్భుతంగా పనిచేస్తుంది. కనుక ఈ రెండింటినీ కలిపి చిన్నారులకు ఇవ్వాల్సి ఉంటుంది. పావు టీస్పూన్ పసుపు, అర టీస్పూన్ తేనెను కలిపి చిన్నారులకు రోజూ రాత్రి పూట నిద్రకు ముందు ఇవ్వాల్సి ఉంటుంది. దీని వల్ల రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారి రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. అల్లం రసం లేదా కషాయం సేవించడం వల్ల కూడా రోగ నిరోధక శక్తిని పెంచవచ్చు. దగ్గు, జలుబు, జ్వరం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. అర టీస్పూన్ తులసి ఆకుల రసంలో తేనె 5 చుక్కలు, కొద్దిగా అల్లం రసం కలిపి చిన్నారులకు ఇస్తుండాలి. దీన్ని ఉదయం పూట పిల్లలకు తాగించాలి. దీని వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

**బెల్లం..**

బెల్లాన్ని మనం తరచూ తీపి వంటకాల తయారీలో ఉపయోగిస్తుంటాం. అయితే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు బెల్లం అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి కనుక బెల్లం చిన్నారులకు ఎంతో మేలు చేస్తుంది. రోజూ చిన్న బెల్లం ముక్కను పిల్లలు తినేలా చూడాలి. దీని వల్ల శక్తి లభించి వారు ఉత్సాహంగా మారడమే కాదు, బద్ధకస్తులుగా మారకుండా ఉంటారు. యాక్టివ్‌గా చదువుకుంటారు. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇక వేపాకులు కూడా చిన్నారులకు అద్భుతంగా పనిచేస్తాయి. ఈ ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు తగ్గేలా చేస్తాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపి రక్తాన్ని శుద్ధి చేస్తాయి. రోజూ ఉదయం పరగడుపునే పిల్లలకు 2 వేపాకులను తినిపిస్తుండడం వల్ల ఉపయోగం ఉంటుంది. వారంలో కనీసం 3 సార్లు అయినా ఇలా చేస్తుంటే ఫలితం ఉంటుంది.

**నెయ్యి..**

పిల్లలకు రాత్రి పూట పాలలో దాల్చిన చెక్క పొడి లేదా యాలకుల పొడి, లవంగాల పొడి, మిరియాల పొడి, పసుపు వంటివి కలిపి తాగిస్తుండాలి. ఘాటుగా ఉంటాయనుకుంటే కాస్త తేనె కలపవచ్చు. ఇలా చేయడం వల్ల కూడా వారిలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులను తట్టుకునే శక్తి లభిస్తుంది. పిల్లలకు రోజూ ఆహారంలో నెయ్యిని పెట్టాలి. ఇందులో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి చిన్నారులకు పోషణను అందిస్తాయి. వారిలో ఎదుగుదల సరిగ్గా ఉండేలా చూస్తాయి. అలాగే రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇన్‌ఫెక్షన్లు తగ్గేలా చేస్తాయి. చిన్నారులకు రోజూ ఒక టీస్పూన్ చ్యవన్‌ప్రాశ్ లేహ్యాన్ని ఇస్తుండడం వల్ల కూడా ఉపయోగం ఉంటుంది. ఇది వారి శక్తి సామర్థ్యాలను పెంచుతుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. వ్యాధుల నుంచి రక్షిస్తుంది. ఇలా ఆయా చిట్కాలను పాటిస్తుంటే చిన్నారుల్లో రోగ నిరోధక శక్తిని సులభంగా పెరిగేలా చేయవచ్చు. దీంతో వారు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..? అయితే మీ శరీరంలో పొటాషియం తగినంతగా లేనట్లే.. ఏం చేయాలంటే..?



మన శరీరానికి అనేక పోషకాలు అవసరం అవుతాయన్న విషయం తెలిసిందే. పోషకాలను పొందాలంటే మనం పౌష్టికాహారం తీసుకోవాల్సి ఉంటుంది. పోషకాల్లో విటమిన్లు, మినరల్స్ కూడా ఒకటి. చాలా మంది విటమిన్లు ఉండే ఆహారాలను తింటారు. కానీ మినరల్స్ కూడా ముఖ్యమే. ఇవి మన శరీరంలో అనేక జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు దోహదం చేస్తాయి. మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇక అలాంటి మినరల్స్‌లో పొటాషియం కూడా ఒకటి. ఇది మన శరీరంలో అనేక విధులను నిర్వర్తిస్తుంది. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడి బీపీ నియంత్రణలో ఉండేందుకు సహాయం చేస్తుంది. హార్ట్ స్ట్రోక్స్ రాకుండా రక్షిస్తుంది. కండరాల నొప్పులు, కండరాలు పట్టుకుపోవడం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు రాకుండా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. కనుక పొటాషియం ఉండే ఆహారాలను మనం రోజూ తీసుకోవాల్సి ఉంటుంది.

**పొటాషియం లోపిస్తే..**

పొటాషియం వల్ల మన శరీరంలోని కణాలు ఉత్తేజం చెందుతాయి. యాక్టివ్‌గా మారుతాయి. దీంతో ఉత్సాహంగా పనిచేస్తారు. చురుగ్గా ఉంటారు. నీరసం, అలసట తగ్గుతాయి. బద్ధకం పోతుంది. కండరాల పనితీరు మెరుగు పడుతుంది. నాడీ మండల వ్యవస్థ చురుగ్గా ఉంటుంది. గుండె అసాధారణ రీతిలో కొట్టుకోకుండా లయబద్ధంగా కొట్టుకుంటుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. ఇలా అనేక రకాల పనులకు పొటాషియం అవసరం అవుతుంది. అయితే మన శరీరంలో పొటాషియం తక్కువగా ఉన్నా, లోపించినా పలు లక్షణాలు కనిపిస్తాయి. కండరాలు బలహీనంగా మారి తరచూ నొప్పులకు గురవుతుంటాయి. రాత్రి పూట నిద్రలో తరచూ కాలి పిక్కలు పట్టుకుపోతాయి. తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. గుండె అసాధారణ రీతిలో కొట్టుకుంటుంది. బీపీ పెరుగుతుంది. ఆకలి ఉండదు. మానసికంగా కుంగిపోయినట్లు అవుతారు. వికారంగా ఉండడం, వాంతికి వచ్చినట్లు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి మల విసర్జన చేసేటప్పుడు రక్తం కూడా వస్తుంది.

**ఎంత అవసరం..**

పొటాషియం సూక్ష్మ పోషకాల జాబితాకు చెందుతుంది. కనుక ఇది రోజూ మనకు చాలా స్వల్ప మొత్తంలో అవసరం అవుతుంది. సాధారణంగా మనకు రోజుకు అవసరం అయ్యే పొటాషియం స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా ఉంటుంది. పురుషులకు అయితే రోజుకు 3400 మిల్లీగ్రాముల మేర పొటాషియం కావాలి. అదే స్త్రీలకు అయితే 2600 మిల్లీగ్రాముల పొటాషియం అవసరం అవుతుంది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు రోజుకు 2900 మిల్లీగ్రాముల మేర పొటాషియం కావాల్సి ఉంటుంది. పొటాషియంను మన శరీరం నిల్వ చేసుకోదు. కనుక రక్తంలో అధికంగా పొటాషియం ఉన్నప్పటికీ శరీరం దీన్ని మూత్రం ద్వారా బయటకు పంపిస్తుంది. అయితే తీవ్రమైన కిడ్నీ సమస్యలు ఉన్నవారు పొటాషియం ఉండే ఆహారాలను మరీ అతిగా తీసుకోకూడదు. డాక్టర్ సూచన మేరకు తీసుకోవాల్సి ఉంటుంది.

**పొటాషియం ఉండే ఆహారాలు..**

పొటాషియం మనకు అనేక ఆహారాల ద్వారా లభిస్తుంది. ఆలుగడ్డలు, చిలగడ దుంపలు, పాలకూర, బీట్ రూట్ ఆకులు, అరటి పండ్లు, అవకాడో, నారింజ, తర్బూజా, కివి, గ్రేప్ ఫ్రూట్, సోయా బీన్, బొబ్బర్లు, మినుములు, బ్లాక్ బీన్స్, రాజ్మా, పప్పు దినుసులు, యాప్రికాట్స్, కిస్మిస్‌లు, ఖర్జూరాలు, పెరుగు, టమాటా, చేపలు, గుమ్మడి విత్తనాలు, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా పప్పు, పొద్దు తిరుగుడు విత్తనాలు, అవిసె గింజలు, చియా సీడ్స్ వంటి అనేక ఆహారాల్లో పొటాషియం మనకు లభిస్తుంది. అయితే ఇవన్నీ ఎందుకనుకుంటే సింపుల్‌గా రోజుకు ఒక అరటి పండు లేదా ఒక నారింజ పండును తినవచ్చు. వీటిల్లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇలా ఆయా ఆహారాలను రోజూ తీసుకుంటే శరీరానికి పొటాషియం సమృద్ధిగా లభిస్తుంది. దీని వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు.

# మరో ఆసక్తికర పోరుకు భారత జట్టు సిద్ధం!

### నాలుగో టీ20లో ఆసీస్‌తో అమీతుమీ..
### గోల్డ్ కోస్ట్ వేదికగా నాలుగో టీ20 మ్యాచ్
### కుల్దీప్, సంజూకు ఉద్వాసన పలికే అవకాశం

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచిన భారత జట్టు మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరిగే నాలుగో టీ20లో ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మూడో టీ20లో అద్వితీయమైన ప్రదర్శనతో ఐదు వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్.. అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలనుకుంటుంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మూడో టీ20లో టీమిండియా మూడు మార్పులు చేయడం జట్టుకు కలిసొచ్చింది. కాంబినేషన్ సెట్ అయ్యిందని మ్యాచ్ అనంతరం సూర్యకుమార్ యాదవ్ తెలిపాడు. దాంతో నాలుగో టీ20లో ఎలాంటి మార్పులు చేయకుండా భారత్ బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అదే జరిగితే కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్‌కు నిరాశే ఎదురుకానుంది. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా టీమిండియా ప్రయోగాలు చేస్తోంది.

హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. గాయంతో తొలి మూడు టీ20లకు దూరంగా ఉన్న నితీష్ కుమార్ రెడ్డి అందుబాటులోకి వస్తే తుది జట్టులో చోటు దక్కనుంది. అతని కోసం శివమ్ దూబేను పక్కన పెట్టవచ్చు. ఈ ఒక్కటి మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది. ముఖ్యంగా గిల్, సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. గిల్ స్థానంలో సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా ఆడించాలనే డిమాండ్ కూడా వ్యక్తమవుతుంది. ఈ క్రమంలోనే అతనికి నాలుగో టీ20 కీలకంగా మారింది.





**ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా

# ఐసీసీ మీటింగ్‌కు మొహ్సిన్ నఖ్వీ డుమ్మా

భారతదేశం ఆసియా కప్ 2025 విజేతగా నిలిచి నెల రోజులు దాటినా.. ఇప్పటివరకు టీమిండియాకు కప్ దక్కలేదు. ఈ విషయంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ తీరు వివాదాస్పదంగా మారింది. భారత్ తరఫున బీసీసీఐ కప్ ఇవ్వాలని పదేపదే లేఖ రాసినా నఖ్వీ పట్టించుకోవట్లేదు. ఈ సమస్య ఇప్పుడు దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో చర్చకు రానుంది. అయితే, ఈ మీటింగ్‌కు నఖ్వీ గైర్హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీసీఐ హెచ్చరికకు భయపడే ఆయన సమావేశాన్ని తప్పించుకుంటున్నారా అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం దుబాయ్‌లో ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ కీలక సమావేశాలకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ హాజరు కావడం కష్టమని తెలుస్తోంది. దేశీయ రాజకీయ సమస్యల కారణంగానే నఖ్వీ దుబాయ్‌కు రాలేకపోతున్నారని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ సమావేశంలో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ అప్పగించడంలో ఆలస్యంపై అంశాన్ని లేవనెత్తే అవకాశం ఉంది. దీని వలన నఖ్వీపై ఒత్తిడి పెరగవచ్చని భావిస్తున్నారు. నఖ్వీ స్థానంలో బోర్డు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ సయ్యద్ ముఖ్య కార్యనిర్వహణ అధికారుల సమావేశంలో పాల్గొంటారు. నవంబర్ 7న జరగబోయే కీలక బోర్డు మీటింగ్‌లో కూడా సయ్యద్ పాకిస్తాన్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. నఖ్వీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనే ఛాన్స్ కూడా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ జరిగింది, కానీ కప్ మాత్రం ఇంకా విజేతలైన టీమిండియాకు అందలేదు. ఆసియా కప్ ఫైనల్ ముగిసిన నెల రోజులు దాటినా, ట్రోఫీ ఇప్పటికీ దుబాయ్‌లోని ఏసీసీ ప్రధాన కార్యాలయంలో లాక్ చేసి ఉంది. ట్రోఫీని వెంటనే ముంబైకి పంపించాలని బీసీసీఐ, ఏసీసీకి లేఖ రాసింది. అయితే, నఖ్వీ మాత్రం బీసీసీఐ ప్రతినిధికి లేదా భారత జట్టు సభ్యుడికి తానే స్వయంగా కప్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అందుకే కప్ అప్పగించడంలో ఆలస్యం జరుగుతోంది. ఫైనల్ మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి నిరాకరించడం ఈ వివాదానికి మూల కారణం. నఖ్వీ భారత్ వ్యతిరేక ప్రకటనలు చేశారనే కారణంతో టీమిండియా ఆటగాళ్లు ఫైనల్ తర్వాత ఆయన చేతుల మీదుగా కప్ అందుకోవడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే మొహ్సిన్ నఖ్వీపై చర్యలు తీసుకోవాలని బీసీసీఐ ఐసీసీ సమావేశంలో డిమాండ్ చేసే అవకాశం ఉంది. గతంలో జై షా ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి నఖ్వీ ఏ ఐసీసీ మీటింగ్‌లోనూ పాల్గొనలేదు. నఖ్వీ పాకిస్తాన్‌లో హోం మంత్రిగా కూడా ఉన్నారు.



# త్వరలో పెళ్లి బంధంలోకి స్మృతి అడుగు



ప్రపంచ ఛాంపియన్ స్మృతి మంధాన త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. స్మృతి తన ప్రియుడు పలాష్ ముచ్చల్ తో పెళ్లి చేసుకోనున్నారు. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ దాదాపు 6 సంవత్సరాలుగా ఒకరితో ఒకరు ఉన్నారు. భారతదేశం ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా పలాష్, స్మృతితో కనిపించారు. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వరల్డ్ కప్ ట్రోఫీతో ఫోటో దిగారు. ఈ జంట భారతదేశం సాధించిన విజయాన్ని కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. పలాష్ తన చేతిపై స్మృతి మంధానా పేరుతో టాటూ కూడా వేయించుకున్నారు. పలాష్ తన సోషల్ మీడియాలో దీని ఫోటోను కూడా షేర్ చేశాడు. పలాష్ ముచ్చల్ సంగీత దర్శకుడు. పలాష్ సోదరి, గాయని పలక్ ముచ్చల్‌తో కూడా స్మృతి మంధానకు మంచి సంబంధం ఉంది. పలక్ ముచ్చల్ స్మృతి పుట్టినరోజున కలిసిన ఫోటో కూడా షేర్ చేసింది. పలాష్ 'తూ హి హై ఆషికీ', 'పార్టీ తో బనతీ హై' వంటి హిట్ పాటలపై వర్క్ చేశారు. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ లవ్ స్టోరీ 2019లో ప్రారంభమైంది. పలాష్ తన సోదరి పలక్ ముచ్చల్ ముందు స్మృతికి ప్రపోజ్ చేశాడు, ఆమె కోసం చాలా అందమైన పాట కూడా పాడాడు. పలాష్ ముచ్చల్ స్మృతి మంధానతో తన సంబంధం గురించి జూలై 2024లో వెల్లడించాడు, అప్పుడు వారి సంబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. పలాష్ ఇటీవల మాట్లాడుతూ స్మృతి మంధానా త్వరలో ఇండోర్ కోడలు కాబోతోందని కూడా చెప్పాడు. ఆనంద బజార్ పత్రిక ప్రకారం, ఈ జంట వివాహం నవంబర్ 20, 2025 న జరగవచ్చు. వీరి వివాహం స్మృతి స్వస్థలమైన సాంగ్లీలో జరగవచ్చు.

## పెరిగిన మహిళా క్రికెటర్ల బ్రాండ్ విలువ

ఫైనల్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించి తొలిసారిగా విశ్వవిజేతగా నిలిచింది. పురుష క్రికెటర్ల మాదిరిగానే తమ ప్రభావాన్ని చూపి వన్డే ప్రపంచకప్‌ను తమ సొంతం చేసుకుంది భారత మహిళా జట్టు. తమ సత్తా ఏంటో ప్రంపంచానికి చాటి చెప్పింది. ఈ విజయంతో మహిళా క్రికెటర్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుసింది. వరల్డ్‌కప్ విజయంతో టీమ్‌ఇండియా మహిళా క్రికెటర్లకు గౌరవం, గుర్తింపు మాత్రమే కాకుండా, వాణిజ్య విలువ కూడా ఆకాశాన్నంటింది. ఇప్పుడు వీరిని బ్రాండ్ ప్రపంచం కొత్త స్టార్‌లుగా చూస్తోంది. మొత్తంగా చూస్తే ఈ ప్రపంచ కప్ విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. మహిళా వరల్డ్‌కప్ ఫైనల్ ముగిసిన 24 గంటల వ్యవధిలోనే హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ వంటి ఆటగాళ్ల బ్రాండ్ విలువలు 25 నుంచి 100 శాతం వరకూ పెరిగినట్లు సమాచారం. మొదటి సారిగా ఐసీసీ ప్రపంచ కప్‌ను గెలుచుకున్న తర్వాత మైదానంలో భావోద్వేగపూరితమైన దృశ్యం ఆవిష్కృతమైంది. గెలుపు అనంతరం భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కోచ్ అమోల్ మజుందార్ పాదాలను తాకి నమస్కరించింది. దీంతో భారత గురు- శిష్య సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ చర్య నిలిచింది. మజుందార్ వెంటనే ఆమెను ఆప్యాయంగా పైకిలేపారు. కాగా ఈ విజయం కోచ్, కెప్టెన్ ఇద్దరి కళ్లలో ఆనంద బాష్పాలను నిపింది.

# జైస్వాల్ మెరుపు సెంచరీ

### పలు రికార్డులు నమోదు

భారత యువ క్రికెట్ సంచలనం యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీ సాధించాడు. ప్రస్తుతం రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై తరఫున ఆడుతున్న జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు సెంచరీతో జట్టును కష్టాల నుంచి గట్టెక్కించాడు. ఈ సెంచరీతో అతను తన అద్భుతమైన టచ్‌ను ప్రదర్శించడమే కాక, గత 45 ఏళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ సగటు కలిగిన ఓపెనర్లలో నెంబర్ 1 స్థానంలో ఎందుకు ఉన్నాడో మరోసారి నిరూపించాడు. రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై జట్టు తరఫున ఆడుతున్న యశస్వి జైస్వాల్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన చేశాడు. జైస్వాల్ కేవలం 120 బంతుల్లోనే 11 బౌండరీల సహాయంతో ఈ సెంచరీని పూర్తి చేశాడు. ఈ సెంచరీతో రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో తీసుకున్న భారీ ఆధిక్యం (300ం రన్స్) ఒత్తిడి నుంచి ముంబై జట్టును గట్టెక్కించాడు. ఇది అతని ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 17వ సెంచరీ కావడం విశేషం. అంతేకాక, రెడ్ బాల్ క్రికెట్ ఆడిన గత నాలుగు ఇన్నింగ్స్‌లలో అతను రెండు సెంచరీలు, మూడు యాభైకి పైగా స్కోర్‌లు చేశాడు. ఈ సెంచరీతో యశస్వి జైస్వాల్ కేవలం దేశీయ క్రికెట్‌లో మాత్రమే కాక, అంతర్జాతీయ స్థాయిలో కూడా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం 2,000 టెస్ట్ పరుగులు చేసిన ఓపెనర్లలో, జైస్వాల్ ఒక అరుదైన రికార్డును నెలకొల్పాడు. అతను 1980 నుంచి ఇప్పటివరకు ఉన్న ఓపెనర్లలో అత్యుత్తమ సగటు కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ సగటు 52.60గా ఉంది. ఈ విషయంలో అతను ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్‌ను వెనక్కి నెట్టాడు, హేడెన్ సగటు 50.73 గా ఉంది. ఈ గణాంకాలు టెస్ట్ క్రికెట్‌లో అతని అద్భుతమైన స్థిరత్వాన్ని తెలియజేస్తాయి. రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యం కారణంగా, ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కష్టాల్లో ఉండే అవకాశం ఉంది. ఈ సమయంలో జైస్వాల్ ఇన్నింగ్స్ జట్టుకు చాలా అవసరం. యశస్వి జైస్వాల్, ముషీర్ ఖాన్ జోడి మొదటి వికెట్‌కు ఏకంగా 149 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, ముంబైకి పటిష్టమైన పునాదిని వేశారు. ముషీర్ ఖాన్ 63 పరుగులు చేసి ఔటైనా, జైస్వాల్ క్రీజులో నిలకడగా ఉండి తన సెంచరీ పూర్తి చేశాడు. అతని ఈ అసాధారణ ఇన్నింగ్స్ ముంబైని సురక్షితమైన స్థితికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

# శ్రీచరణి వల్లే భారత్ గెలిచింది

### శ్రీచరణిపై అశ్విన్ ప్రశంసల జల్లు





భారత మహిళా స్పిన్నర్, తెలుగు తేజం నల్లపురెడ్డి శ్రీచరణిపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. శ్రీ చరణి అద్భుత ప్రదర్శనతోనే టీమిండియా విజేతగా నిలిచిందని కొనియాడాడు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో 52 పరుగుల తేడాతో విజయం సాధించి తొలి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ టోర్నీలో ఆంధ్ర ప్రదేశ్, కడప జిల్లాకు చెందిన 21 ఏళ్ల శ్రీ చరణి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ఫైనల్‌తో సహా సెమీఫైనల్లో శ్రీ చరణి కట్టడిగా బౌలింగ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రపంచకప్ ఆడిన తొలి క్రికెటర్ గుర్తింపు పొందిన శ్రీచరణి.. పటిష్టమైన ఆస్ట్రేలియాపై లీగ్ మ్యాచ్‌తో పాటు సెమీఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై ఆమె 5 వికెట్లు పడగొట్టింది. సెమీఫైనల్ ఓటమి తర్వాత ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ.. భారత జట్టులో శ్రీ చరణి ప్రమాదకరమైన బౌలర్ అని పేర్కొంది. అంటేనే ఆమె ప్రభావం ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా ఈ విజయంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. శ్రీ చరణిని ప్రత్యేకంగా కొనియాడాడు. భవిష్యత్తులో ఆమె సూపర్ స్టార్ అవుతుందని జోస్యం చెప్పాడు. ఆమె బౌలింగ్ టెక్నిక్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. మహిళల క్రికెట్‌లో గొప్ప స్పిన్నర్లు అయిన సోఫీ ఎక్లెస్టోన్, జెస్ జోనాసెలతో శ్రీచరణిని పోల్చాడు. 'శ్రీ చరణి బంతి తిప్పే విధానం, వేగం అద్భుతం. ఆమె బౌలింగ్ టెక్నిక్ సోఫీ ఎక్లెస్టోన్, జెస్ జోనాసెన్, సోఫీ మోలినెక్స్ వంటి టాప్ స్పిన్నర్ల తరహాలోనే ఉంది. ఆమె వెయిట్ ట్రాన్స్‌ఫర్ అమోఘం. బౌలింగ్ చేసే సమయంలో ఆమె శక్తి ఏం వృథా కావడం లేదు. భవిష్యత్తు శ్రీచరణి తప్పకుండా సూపర్ స్టార్ బౌలర్ అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. భారత్ సాధించిన అన్ని ప్రపంచకప్‌ల కంటే ఈ విజయం ఎంతో గొప్పదని కొనియాడాడు. ముఖ్యంగా ప్రపంచకప్ టైటిల్‌ను మాజీ క్రికెటర్లు అయిన మిథాలీ రాజ్, జులాన్ గోస్వామికి అందించడాన్ని అశ్విన్ ప్రత్యేకంగా అభినందించాడు. 'భారత మహిళల జట్టు ప్రపంచకప్‌ను తీసుకెళ్లి మిథాలీ రాజ్ చేతిలో పెట్టింది. ఈ విషయంలో నేను హర్మన్ సేనను అభినందిస్తున్నా. భారత పురుషుల జట్టు ఇలా గతంలో ఎప్పుడూ చేయలేదు. కొన్నిసార్లు మీడియా ముందు మాత్రం ఏదో చెబుతుంటాం. ఆ వ్యక్తి అలా చేశాడు.. ఇలా చేశాడని గొప్పగా చెబుతాం. కానీ మాజీ ఆటగాళ్లకు క్రెడిట్ ఇవ్వడాన్ని నేను అయితే చూడలేదు. మా తరం బాగుంది. మీ తరం టీమ్ అంత గొప్పగా లేదనే చర్చలే ఎక్కువగా జరుగుతుంటాయి.

# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.





# పెద్దిలో మోహిత్ చౌహాన్ పాట

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.

# రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ది హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్దమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.



# దుల్కర్ సల్మాన్..కాంత మూవీ

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.




# పిఠాపురంలో..అలా మొదలయ్యింది

తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారంమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.



# ప్రభాస్ పై కన్నేసిన రష్మిక

నేషనల్ క్రష్ రష్మిక ఈ ఇయర్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఆడియన్స్ ను అలరిస్తోంది. ఈ ఇయర్ ఇప్పటికే ఆమె నుంచి నాలుగు సినిమాలు రిలీజయ్యాయి. వాటిలో రెండు సినిమాలు హిట్టవగా మరో రెండు సినిమాలు ఫ్లాపయ్యాయి. ఇప్పుడు నవంబర్ 7న ది గర్ల్ ఫ్రెండ్ తో రష్మిక ప్రేక్షకుల ముందుకు రానుంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ప్రమోషన్స్ లో రష్మిక యాక్టివ్ గా పాల్గొంటుంది. సరికొత్త లవ్ స్టోరీతో తెరకెక్కిన ఈ మూవీలో రష్మిక కు జోడీగా దీక్షిత్ శెట్టి నటించగా, ది గర్ల్ ఫ్రెండ్ గురించి అందరూ చాలా గొప్పగా చెప్తున్నారు. ఇప్పటికే సౌత్, నార్త్ లోని పలువురు స్టార్ హీరోలతో నటించారు రష్మిక. తెలుగులో అల్లు అర్జున్, మహేష్ బాబు, విజయ్ దేవరకొండ, నాని లాంటి స్టార్లతో నటించిన రష్మిక, బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్, రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్, సిద్ధార్థ్ మల్హోత్రా, ఆయుష్మాన్ ఖురానా లాంటి హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకున్నారు అలాంటి రష్మిక ఇప్పుడు ఇండియన్ స్టార్ హీరోపై కన్నేశారు. ది గర్ల్ ఫ్రెండ్ ప్రమోషన్స్ లో భాగంగా రష్మిక చాట్‌సెషన్ ను నిర్వహించగా, అందులో రష్మికకు ఓ ప్రశ్న ఎదురైంది. మీరు ప్రభాస్ తో కలిసి నటిస్తారా? అదే జరిగితే మీ కాంబో హైప్ దెబ్బకు నా శవం థియేటర్లో ఉంటుంది, దాన్ని కలెక్ట్ చేసుకోండని ఓ నెటిజన్ ట్వీట్ చేయగా, దానికి రష్మిక రియాక్ట్ అవుతూ సమాధానమిచ్చారు. ప్రభాస్ తో కలిసి యాక్ట్ చేయడం తనక్కూడా ఇష్టమేనని, ప్రభాస్ ఈ మెసేజ్ లు చూస్తారని ఆశిస్తున్నా.. తామిద్దరూ కలిసి ఫ్యూచర్ లో నటిస్తే తన కెరీర్లోనే ఆ సినిమా చాలా స్పెషల్ గా నిలుస్తుందని రష్మిక రిప్లై ఇచ్చారు. రష్మిక చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ చేయనున్న స్పిరిట్ మూవీ కోసం మేకర్స్ రష్మికను సంప్రదించారని వార్తలొచ్చాయి. కానీ తర్వాత ఆ ఛాన్స్ యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రిని వరించింది. మరి రష్మికకు ప్రభాస్ తో కలిసి నటించే ఛాన్స్ ఎప్పుడొస్తుందో చూడాలి.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463